

# నా కళ్ళతో నాన్న

**– లిపి మల్లాది**



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**మా నాన్న** రాసిన పుస్తకాలు చదివి చాలామంది ప్రభావితులై ఉంటారు. ఎంతోమంది ఇన్స్పైర్ అయివుంటారు. కానీ తన రచనలద్వారా మా నాన్న తన జీవితంలోని అతి విలువైన వ్యక్తిని పొందారు. అవును, అది మా అమ్మ. చిన్న వయసునుండే పుస్తకాలు చదవడం అలవాటైన మా అమ్మ నిమోనియా వచ్చి ఏడాదిపాటు బెడ్ రెస్ట్ తీసుకోవాల్సొచ్చినప్పుడు కాలక్షేపానికి తన అన్నయ్య అద్దె షాపులో నుండి పుస్తకాలు తెచ్చి ఇచ్చేవారట. తన అక్క రంగవల్లి ఇచ్చిన సలహాపై మా నాన్న నవలలు చదవడం మొదలు పెట్టిందట (కానీ ఆ సంవత్సరం ఇంటర్ పరీక్షలు అటెండెన్స్ లేకపోయినా స్పెషల్ పర్మిషన్‌తో రాసి ఫస్ట్‌క్లాస్‌లో పాసైందట.) అలా ఏడాదిపాటు ఎంతో మంది రచయితలు రాసిన ఎన్నో వందల పుస్తకాలు చదివినా, ఏదీ మల్లాది రచనలకి సాటి రాలేదనుకుంటాను.

హైదరాబాద్ వచ్చినప్పుడు ఈనాడులో పనిచేసే తన ఫ్రెండ్ శాంతిని మా నాన్న అడ్రెస్ అడిగి "నేను మీరు రాసిన కథలు అన్నీ అపరాధపరిశోధనలాంటి వాటిలో చదివాను. మీ ఫాన్‌ని. హైదరాబాదులో మా అన్నయ్య ఇంట్లో ఉన్నాను. మిమ్మల్ని కలవడం కుదురుతుందా?" అని పోస్ట్ బాక్స్ నం 1807 అడ్రస్‌కి తన మొదటి ఉత్తరం పంపింది. అది జరిగిన కొన్ని రోజులకి మా నాన్నని మొట్టమొదటిసారిగా తన అన్నయ్య ఇంట్లో కలిసింది మా అమ్మ.

"మా గృహప్రవేశం జరిగినప్పుడు చాలామంది అమ్మాయిలు ఈయన్ని పరిచయం చెయ్యమని అడిగారు.." అని కొన్ని సంవత్సరాల క్రితం మా నాన్న ఫ్రెండ్ భార్య హైదరాబాద్‌కి వచ్చినప్పుడు చెప్పారు.

"అయ్యో, నేను అప్పుడే కలిసుండాల్సిందే మీదగ్గర ఫోటోస్ ఉంటే నెక్స్ట్ టైం చూపించండి" అని మా అమ్మ నవ్వింది.

ఆ రోజు తన అన్నయ్య ఇంట్లో మొదటిసారి కలిసినప్పుడు ఏర్పడిన పరిచయం పెన్ ఫ్రెండ్షిప్‌కి దారి మలచింది.

పోస్ట్‌మాన్ మా అమ్మతో "నీకు ఆ చిక్కిరి బిక్కిరి రైటింగ్ నుండి ఉత్తరం వచ్చింది" అనేవారట (మా నాన్న రైటింగ్ అంతగా బావుండదు.) తన అన్నయ్యలు మా నాన్న రాసిన ఉత్తరం చదువుతామని లాక్కునేవారట.

"ఓ చదవండి. ఏం ఫరవాలేదు" అని మా అమ్మ ఇచ్చేదట.

కాసేపు ప్రయత్నించి "ఏమీ అర్థంకావడంలేదు. నువ్వెలా చదువుతున్నావు?" అని వెళ్ళిపోయేవారట.

"మీ నాన్న రాసింది మీ అమ్మ కళ్ళకి మాత్రమే అర్థమౌతుంది" అని ఒకావిడ నవ్వారు.

"నాన్న రైటింగ్ ఉర్దూలా ఉంటుంది" అని నేను, కావ్య, ఊహ అనుకునేవాళ్ళం. నేను ఇంజనీరింగ్ చదువుతుండగా నా క్లాస్‌మేట్ ఓ ముస్లిం అమ్మాయికి మా నాన్న రాసిన ఓ పేపర్ చూపించి "డూ యు నో దిస్ లాంగ్వేజ్?" అని అడిగాను.

"యూ నో అరబిక్? ఇట్ లుక్స్ లైక్ అరబిక్. బట్ ఐ కాంట్ రీడ్" అని ఆ అమ్మాయి అనగానే నేను నవ్వడం చూసి బిత్తరపోయింది.

"మీకు ఈ రైటింగ్ ఎలా అర్థమౌతుంది?" అని చుట్టాలు మొదలు లాస్ట్ ఇయర్ పరిచయమైన ఫ్రెండ్స్ వరకు చాలామంది అడగడం వింటూనే ఉన్నాను.

"ఆ రాత నాకు అర్థమవ్వాలన్నది బ్రహ్మ రాత" అంటుంది మా అమ్మ.

తన పద్దెనిమిది - ఇరవై ఏళ్ళనాటి ఉత్తరాలు, వచ్చిన జవాబులు ఈ రోజుకీ భద్రంగా దాచి పెట్టుకుంది మా అమ్మ. ఎలాంటి సెంటిమెంట్స్, వస్తువులపై అటాచ్‌మెంట్స్ లేని మా నాన్నకూడా ఆ ఉత్తరాలని మాత్రం దాచారు. ఎన్నేళ్ళైనా, ఎంత వయసు తేడా ఉన్నా వారి మధ్య ప్రేమ తరగకపోవడానికి ముఖ్యకారణం వారి అభిరుచులు కలవడం, ఒకరి మనస్తత్వాన్ని మరొకరు అర్థం చేసుకోవడం.

పెళ్ళికి ముందు ముఖేష్ పాటలు వినే మా అమ్మ పెళ్ళయ్యాక కిషోర్ కుమార్ ఫాన్ అయ్యింది. సినిమాలు ఇష్టపడని మా నాన్న పెళ్ళయ్యాక ప్రివ్యూలకి వెళ్ళడం మొదలుపెట్టారు. అమ్మ వంట నేర్చుకోవడం మొదలుపెడితే నాన్న వంటల పుస్తకాలు రాసారు. నాన్న రైటింగ్ బావుండదని అమ్మ ఫెయిర్ కాపీ చేస్తుంది. ప్రేమ, ఆప్యాయతలతో జీవించేవారు "పెళ్ళికి ముందు ఫ్రేండ్‌షిప్ కావాలి" అన్న నా కోరికకి చాలా ఆశ్చర్యపడ్డారు. "ఫ్రేండ్‌షిప్ థాట్ ఉంటే పెళ్ళే చేసుకోకు" అని కావ్య, "ఫ్రేండ్‌షిప్ అంటే ఎవరూ పెళ్ళి చేసుకోరు" అని మా అమ్మ అన్నారు.

"డివోర్స్ అవుతుందేమో అన్న ఆలోచనతో పెళ్ళిలోకి వెళ్ళకూడదమ్మా, ఎన్ని ఎడబాట్లు వచ్చినా కలిసే ఉండాలి, అప్స్ అండ్ డౌన్స్ ఉంటాయి. డౌన్స్‌లో వదిలిపెట్టకూడదు. యూ షుడ్ నాట్ క్విట్. సహనంగా ఉండాలి. మీ అమ్మని చూసి నేర్చుకోమ్మా, తనే నీకు ఉదాహరణ" అని మా నాన్న చెప్పారు.

తను చెప్పినట్టుగా మా అమ్మ సహనానికి హద్దులేదు. (మా అమ్మ సహనాన్ని నేను పరీక్షించిన విధంగా ప్రపంచంలో ఎవరూ ఎవరి సహనాన్ని పరీక్షించి ఉండకపోవచ్చు.) కానీ ఆ సహనం మా అమ్మ ప్రత్యేకత కాదు. ఎందుకంటే, నా ఉద్దేశం ప్రకారం అది మా తాతయ్యనుండి తనకి వచ్చిన వారసత్వం.

పుట్టిన వెంటనే శుభ్రం చెయ్యడానికి తీసుకు వెళుతున్న నర్సు అరచేతిలో సరిపోయిన మా అమ్మని చూసి ఆశ్చర్యపోయిన మా తాతయ్య ఆ కథని మా అమ్మకి చెప్పారట. రోజుకి పదిసార్లు అడిగినా ఎంతో సహనంగా మా అమ్మకి ఆ సంగతిని వివరించేవారట. కుటుంబానికి గల విలువ, అంతులేని ప్రేమ, కొలతలేని ఓర్పు కూడా అమ్మకి తాతయ్య నుండే వచ్చాయి. మా అమ్మమ్మని పెళ్ళి చేసుకోవడం కోసం కాశీలోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో చదివి, మూడు రోజులు తిండీ తిప్పలు మాని మరీ ఇంట్లో వారిని ఒప్పించారట (అదే మా అమ్మ ఫేవరెట్ లవ్ స్టోరీ) అవే లక్షణాలు మా నాన్నలో ఉన్నా మాటల్లో కాక చేతల్లో కనపడతాయి.

నా చిన్నప్పుడు మా నాన్న బిజీగా ఉండగా, "నాన్నా! అటు చూడు - ఇటు చూడు .. పైకి చూడు.. మంకీ, మంకీ, మంకీ" అని నేను ఎగిరినప్పుడు "అయ్యో! మళ్ళీ మంకీ అయిపోయాను" అని మా నాన్న నాతో కలిసి నవ్వడం, తను గదిలో ఆ చివర, నేను ఈ చివర ఉండి గాల్లో షేక్ హేండ్ ఇవ్వడం, "19991 లో పుట్టడానికి ముందు నువ్వు ముసలమ్మవి. కర్ర పట్టుకుని వంగి ఇలా నడుస్తూ

ఉండేదానివి" అని నన్ను ఏడిపించడం, తన కుర్చీ వెన్క నేను దాక్కుని 'భౌ' అని అరవగానే నిజంగా భయపడినట్టు నటించడంలాంటి జ్ఞాపకాలు మా నాన్న నాకు ఇచ్చిన బహుమతులు.

నాకు దెయ్యాల కథలపై ఉన్న ఆసక్తి గ్రహించిన మా అమ్మ నాకోసం భూతమాల, భూతసుందరి వంటి ఆటలు కనిపెట్టింది. (అవి కేవలం మా కుటుంబానికి మాత్రమే తెలుసు) తల దువ్వించుకోవాలంటే ఓ కథ, భోంచెయ్యాలంటే ఓ కథ, కొత్త బట్టలు వేసుకోవడానికి ఓ కథ, హోం వర్క్ పూర్తిచేసాక ఓ కథ.. అలా ఒక్కరోజులోనే పది కథలు చెప్పే మా అమ్మని "నీకు ఇన్ని కథలెలా వచ్చు?" అని మా నాయనమ్మ అడిగారు కూడా.

ఎంత బిజీగా ఉన్నా, ఎంత టైం లేకపోయినా మేం ముగ్గురం దేనికీ దూరమవ్వకూడదని వాళ్ళు చాలా ప్రయత్నించారు అని నేను ఈ మధ్యే తెలుసుకున్నాను. ఓసారి కావ్య చిన్నప్పుడు స్కూల్లో ఉండగా ఫాన్సీ డ్రస్ కాంపటీషన్‌కి బట్టలు కొనడానికి సమయం లేకపోయింది. కానీ కావ్య పార్టిసిపేట్ చెయ్యాలనుకుంటుందని తెలుసుకున్న మా అమ్మ ఇంట్లో ఉన్న విభూతి, గంట మొదలుగున్నవి ఉపయోగించి కావ్యకి బ్రాహ్మణుడి వేషం వేసింది. ఈరోజుకీ మేము అది గురుత్తెచ్చుకుని నవ్వుకుంటుంటాము. మా ముగ్గురి బాల్యం ఎన్నో మరుపురాని జ్ఞాపకాలతో నిండేందుకు వాళ్ళు పడ్డ పాట్లు ఈ రోజు మేం తెలుసుకున్నాం. అంత అందమైన బాల్యం అందరికీ దొరకదని నేను ఆలస్యంగా తెలుసుకున్నాను. మా అమ్మ చెప్పిన కథలు విని "తాతయ్యంత నిన్ను ఎవరూ ప్రేమించలేరు" అనుకున్నాను. అదే విధంగా మా నాన్న మమ్మల్ని ప్రేమించినంతగా ఎవరూ ప్రేమించలేరు.

ఆ జ్ఞాపకాలు, ఆ ప్రేమ ఆప్యాయతలే మమ్మల్ని తీర్చిదిద్ది, ఈ రోజుకీ ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా నన్ను నడుపుతున్నాయి.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story